క్లుప్తంగా

విద్యార్థులకు రుచికరమైన భోజనం



విద్యార్థులకు వడ్డిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్దను పక్కాగా అమలు చేసి వారికి మంచి రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ-1 సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఆయన మండలంలోని పెదపెంకి-3 ప్రాథమిక పాఠశాలను సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మెనూ పరిశీలించి మెనూ ప్రకారం వంటలు వండింది లేనిదీ తెలుసుకున్నారు. విద్యార్థులచేత ఆంగ్ల పాఠాలు చదివించి పదాలకు అర్థాలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఏ-2 జవాబు పత్రాలను తనిఖీ చేశారు. ఆన్‌లైన్ చేసిందీ లేనిదీ అడిగారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, సీఆర్పీ సుభాషిణి పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఒరిజనల్ మార్క్స్ లిస్టుల పంపిణీ



విద్యార్థులకు మార్కుల మెమోలు అందజేసిన డీవీఈఓ మంజులా వీణ

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు ఒరిజనల్ మార్క్ మెమోలను సోమవారం జిల్లా వృత్తి విద్యాధికారిణి మంజులావీణ స్థానిక డీవీఈఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంబంధించిన మార్కుల మెమోలు, సర్టిఫికెట్లను అందజేశామని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలకు పంపిణీ చేశామని చెప్పారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఎఫ్ఓ ప్రసూన

సాలూరు: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటిల్లో విజేతలకు డీఎఫ్ఓ ప్రసూన సోమవారం బహుమతులు అందజేశారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సాలూరు, మక్కువలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన 15 మందికి సాలూరు పట్టణ సమీపంలోని వెదురు వేలం డిపోలో ప్రశంసాపత్రాలు, మెరిట్‌షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రామారావు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, నీడ్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

63 వినతుల స్వీకరణ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి 63 వినతులు స్వీకరించారు. చిన్నగుమ్మడకు చెందిన సవర భీమారావు ఆటో కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని.. కుట్టుమిషన్ మంజూరు చేయాలని కిరపకు చెందిన శ్రావణి.. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని జాడుపల్లికి చెందిన గాయత్రి, తదితరులు వినతులు సమర్పించారు. అలాగే మరికొంతమంది వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన..



ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

భామిని: తాడేపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆశా వర్కర్ కృపమ్మ మరణించడానికి కారణమైన మెడికల్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ స్థానిక ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ, మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 50 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు.

జేఏఎస్ శిబిరానికి తరలివచ్చిన ప్రజలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బద్నాన ప్రమీల



వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాచిపెంట: మండల కేంద్రం పాచిపెంట-2 సచివాలయం పరిధిలోని జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి మంచిస్పందన లభించింది.ప్రజలు వెల్లువలా వచ్చి వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా శిబిరంలో మొత్తం 562 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. స్పాట్ రిజిస్ట్రేషన్, ఇంటింటి సర్వేలో ఎంపిక చేసిన వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ బద్నాన ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ పాల్గొని మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అంగన్వాడీల ప్రదర్శన

ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు జగనన్న సంపూర్ణ పోషణ్ కిట్, ఆరోగ్యాన్ని ఇచ్చే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు కోడిగుడ్లు ప్రదర్శించారు. వాటి ప్రాధాన్యతను గర్భిణులు, బాలింతలు, ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ చిహ్నాన్ని టమాటోలు, కోడిగుడ్లు, పాలప్యాకెట్లు, ఆకులు, పూలు, ముగ్గుతో అందంగా వేశారు.



మాట్లాడుతున్న నాయకులు

కురుకూటిలో జేఏఎస్ వైద్యశిబిరం

సాలూరు: మండలంలోని కురుకూటిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం విజయవంతమైంది. సర్పంచ్ వంతల ఎండమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. ప్రజల చెంతకు ఉచితంగా వైద్యసేవలు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనువాసరావు, మువ్వల ఆదయ్య, సుబ్బారావు తదితరులు ప్రశంసించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏగోటివలసలో ఇంటింటి కుళాయిలు



ఇంటింటి కుళాయి పనులను పరిశీలిస్తున్న ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలో నూతనంగా ఏర్పడిన ఏగోటివలస గ్రామ పంచాయతీలో ఇంటింటి కుళాయిలు, కాలువల పనులు జోరందుకున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాయిపిల్లి పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన గ్రామంలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.6 లక్షల నిధులు మంజూరు చేయడంతో ఇంటింటి కుళాయిల కోసం ప్రధానపైప్‌లైన్ వేస్తున్నట్లు చెప్పారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం పథకం ద్వారా గ్రామస్తులు కాలువల నిర్మాణం చేపట్టాలని కోరడంతో ఎమ్మెల్యే జోగారావు స్పందించి రూ.10 లక్షలు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఆ నిధులు విడుదల కావడంతో కాలువల పనులు పూర్తయ్యాయని తెలియజేశారు. సర్పంచ్ ఉరిటి రాధాకృష్ణ మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఎమ్మెల్యే కృషి ఫలితంగా విద్యుద్దీకరణ పనులు, రోడ్డు నిర్మాణం జరిగాయన్నారు.

అప్పయ్యపేటలో ఆరోగ్య సర్వే



మాట్లాడుతున్న ఎంపీటీసీ కుసుమ

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేటలో వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి ఆరోగ్య సర్వేను ఎంపీటీసీ బి.కుసుమ, సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజలందరికీ ఆరోగ్యభద్రత కల్పించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో గ్రామాల్లో ఇళ్లలోనే ఆరోగ్య సర్వే నిర్వహించడం వల్ల పేదలందరికీ స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నివారణకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

జేఏఎస్‌తో మంచి ఫలితాలు



గర్భిణిని తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శిరీష

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాల ద్వారా ఇళ్లలోనే వైద్య సేవలందించడంతో మంచిఫలితాలు వస్తున్నాయని వైద్యాధికారులు అన్నారు. ఈ మేరకు సీతానగరం, పెందంకలాం పీహెచ్‌సీల్లో గర్భిణులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష, డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ సెప్టెంబరు రెండవ వారంనుంచి గ్రామాల్లో పీహెచ్‌సీ సిబ్బంది ద్వారా ఇంటింటికీ సర్వే చేసి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం, వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యనిపుణులతో తనిఖీ చేయించడం కోసం కూపన్లు పంపిణీ చేశామన్నారు. వారందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించడానికి స్పెషలిస్ట్ డాక్టర్లతో గ్రామాల్లోనే ఉచితంగా వైద్యపరీక్షలు చేయడం, వ్యాధి నిర్ధారణ అనంతరం నివారణకు అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- వాహనాల తనిఖీకి స్పెషల్ డ్రైవ్
- ఎంవీఐ శశికుమార్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ శశికుమార్, సిబ్బంది

పార్వతీపురంటౌన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పలు చోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా నియమావళిని పాటించకపోవడం వల్లనే వాహన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన డ్రైవ్‌లో 45 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.2.10 లక్షలు అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మోటార్ వెహికల్ త్రిపుల్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ఆటో వాలాలు ఓవర్‌లోడ్ ప్రయాణం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు రమేష్ కుమార్, కాశీరామ్ నాయక్, వర ప్రసాద్, సత్యనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

పార్వతీపురంటౌన్: ప్రపంచ నిరాశ్రయుల దినం సందర్భంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు బెలగాంలోని రైతు బజార్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ ప్రతినిధి ప్రకాశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మార్సీకి చేరిన వంటసామగ్రి



ఎమ్మార్సీలో వంటపాత్రలను పరిశీలిస్తున్న ఎంఈఓ జి.సూరిదేముడు

సీతానగరం: మధ్యాహ్న భోజన పథకం అమలుకు సంబంధించి అవసరమైన వంటసామగ్రిని ప్రభుత్వం సమకూర్చిందని ఎంఈఓ జి.సూరిదేముడు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండలవిద్యావనరుల(ఎమ్మార్సీ) కేంద్రానికి 60 పాఠశాలలకు అవసరమైన వంట స్టీలు సామగ్రి రాగా వాటిని ఎంఈఓ సూరిదేముడు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాజరును అనుసరించి విద్యాశాఖ 5 కేటగిరీలుగా విభజించి వంట సామగ్రి కిట్‌లను కేటాయించినట్లు చెప్పారు. నిర్దేశించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా కిట్‌లను త్వరలో ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలోఎంఈఓ ఎం.వెంకటరమణ, స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



సురగాల సూరయ్య(ఫైల్)

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు సురగాల సూరయ్య (107 సంవత్సరాలు) సోమవారం స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలియజేశారు. నూటఏడు సంవత్సరాలు ఒకరిపై ఆధారపడకుండా జీవించడం, సూరయ్య రాష్ట్ర రహదారిపై పూర్వం సువర్ణముఖినదిపై నిర్మించిన బ్రిడ్జి పనుల్లో పాల్గొన్న సందర్భాన్ని, సంఘటనలను తెలియజేశారు. గ్రామంలో ఏవైనా మంచి, చెడు కార్యక్రమాలు చేపట్టినా పెద్దవాడైన ఆయన సూచనలు, సలహాలు అందించేవారని చెప్పారు.

గ్రామసభ

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో గ్రామసభ సోమవారం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. సర్పంచ్ బి.చంద్రినాయుడు మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అలాగే పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యదర్శి టి.భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఓటరు జాబితా పెండింగ్ పనులు పూర్తిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం:

ఓటరు జాబితా పెండింగ్ పనులు పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో సాలూరు నియోజకవర్గ ఓటరు జాబితా సవరణ అంశంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ అంశాలు పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. బూత్‌స్థాయి అధికారినుంచి ప్రతి స్థాయిలో అన్ని అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. పదిమంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలు, ఓటర్లు లేని గృహాలు, వందకంటే ఎక్కువ వయస్సు కలిగిన ఓటర్లు ఉన్న గృహాలు విధిగా పరిశీలించాలని స్పష్టం చేశారు. ఫారం-7,8,9 పైన ప్రత్యేక శ్రద్ధవహించాలని సూచించారు. సమావేశంలో సహాయ ఓటరు నమోదు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నా దేశం నా మట్టిని పరిరక్షించుకోవాలి



పంచాయతీ కార్యదర్శులు సేకరించిన మట్టి, ధాన్యం ఇత్తడి చెంబులో భద్రపరుస్తున్న మండల పరిషత్ కార్యాలయ ఏఓ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ కుమారవర్మ

సీతానగరం: మనం నమ్ముకున్న దేశాన్ని, మనల్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్న మట్టిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్వహించిన నా దేశం నామట్టి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన మట్టి, ధాన్యం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల నుంచి సోమవారం ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రతిగ్రామం నుంచి పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నా దేశం- నా మట్టి సందేశాన్ని ప్రజలకు అర్థమయ్యే విధంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లో ప్రజలనుంచి రైతులు పండించిన ధాన్యం, మట్టిని సేకరించిందని చెప్పారు. గ్రామాల్లో సేకరించిన మట్టిని, ధాన్యాన్ని కలబోసి ఇత్తడి బిందెలో వేసి జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ, పెదభోగిలి మేజర్ పంచాయతీ ఈఓ జె.వెంకటరమణ, చినభోగిలి కార్యదర్శి మనోహర్, సీహెచ్ రమేష్ ఇతర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



నీలకంఠాపురంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

- జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

సీతానగరం: రైతులు పొలాల్లో పండిస్తున్న పంటలను వ్యవసాయ సిబ్బందితో విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్ పాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతానగరం, పార్వతీపురం మండలాల్లోని పంటపొలాల్లో ఆయా మండలాల వ్యవసాధికారుల పర్యవేక్షణలో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని నీలకంఠాపురం, పెదభోగిలి, వెంకటాపురం, ఇప్పలవలస, జోగింపేట గ్రామాల్లో పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని రైతులంతా తమ పొలాల్లో సాగుచేస్తున్న పంటలను ఈ కేవైసీ చేయించుకోవాలని, ఈకేవైసీ చేయని పంటలు విక్రయ సమయంలో సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తాయన్నారు. రైతులందరూ స్పందించి ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ ఎస్ అవినాష్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈఓ సామల, ప్రధానోపాధ్యాయుడుఅ

బలిజిపేట: ఇస్రో ఉత్తరాంధ్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థిని పూజితను ఎంఈఓ సామల సింహాచలం, బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రసాద్ అభినందించారు. ఇస్రో ఆధ్వర్యంలో తగరపువలసలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బలిజిపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి(ఇంగ్లీషు మీడియం) చదువుతున్న విద్యార్థిని అంపావల్లి పూజిత ప్రథమస్థానం కై వసం చేసుకుంది. సుమారు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో ప్రథమ స్థానం పొంది బలిజిపేట ఉన్నత పాఠశాలకు, మండలానికి, గ్రామానికి మంచిపేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన విద్యార్థిని భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఎంఈఓ సామల ఆకాంక్షించారు. పూజితకు సూచనలు అందించిన ఉపాధ్యాయురాలు పి.అనూరాధను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై దృష్టి



రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన పార్వతీపురం మండలంలోని డోకిశీల పీహెచ్‌సీలో గర్భిణులకు నిర్వహించిన పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని సోమవారం తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, ల్యాబ్ పరీక్షలు పరిశీలించారు. ఎంసీపీ కార్డులు, రికార్డులు పరిశీలించి అందులో నమోదు చేసిన ఆరోగ్య వివరాల నివేదికలను తెలుసుకున్నారు. రక్త హీనతగా గుర్తించిన గర్భిణులకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారో సిబ్బందిని ఆరా తీశారు. అక్కడ గర్భిణులతో డీఐఓ మాట్లాడుతూ ప్రతి రోజూ ఐరన్, కాల్షియం మాత్రలు వేస్తున్నారా, వైద్య సిబ్బంది గృహ సందర్శన చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేస్తున్నారా, అని వారికి అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నమోదైన గర్భిణులకు పూర్తిస్థాయిలో ల్యాబ్ పరీక్షలు జరుగుతున్నాయా అని తనిఖీ చేశారు. ఇంతవరకు గుర్తించిన హైరిస్క్ గర్భిణులతో పాటు కొత్తగా ఈరోజు తనిఖీలోఎంతమంది గర్భిణుల్లో హైరిస్క్‌ను గుర్తించారని వైద్యాధికారులను అడిగారు.

కార్యక్రమంలో వైద్యాధికారులు బి.నిహారిక, జి.శిరీష, సూపర్‌వైజర్స్ శ్రీనివాసరావు, ఎస్.జయ, జయగౌడ్, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.